www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 7 జూన్ 2025
5
కాకినాడ

ఆపదలో రక్తదానం చేసిన యువకులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గర్భిణికి అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో వివేకానంద సేవ సమితి ట్రస్ట్ సభ్యులు పెండ్యాల రాజు, కలగంట్ల రాజేష్, పళ్ళ రాజేశ్వరరావు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేశారు. వీరిని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఛైర్మన్లు వాగు రాజేష్, జొన్నాడ వీరబాబు, సభ్యులు బుగత శ్రీను, పేకేటి బాబి, పిచ్చేటి కృష్ణ, వైద్యులు అభినందించారు.

రక్తదానం చేస్తున్న యువకులు

రారెత్తిస్తున్న ఎండలు

- నిప్పులు కక్కుతున్న భానుడు
- వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి
- వేళాపాలా లేకుండా కరెంటు కోతలు

ప్రజాశక్తి - రాజోలు, రామచంద్రపురం, గండేపల్లి

'అమ్మో ఎండలు.. బాబోయ్ ఎండలు.. వేడిని భరించలేకపోతున్నాం..బయటకు రావాలంటే భయం వేస్తోంది..'' రెండు రోజులుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఎవరిని కదిపినా ఇవే మాటలు వినిపిస్తున్నాయి. రారెత్తిస్తున ఎండలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోహిణి కార్తె ప్రారంభంలో ముందుగానే వచ్చిన రుతుపవనాల కారణంగా వర్షాలు పడడంతో వాతావరణం చల్లబడి అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే గత నాలుగు రోజులుగా సూర్యుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం నుంచి తీవ్రమైన ఎండలు, వడగాలులు, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. రోజూ దాదాపుగా అన్నిచోట్లా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం ఇంటి నుంచి బయటకు వెళ్లాంటేనే భయాందోళన చెందే పరిస్థితి నెలకొని ఉంది. ఉద్యోగాలకు, ఇతర పనులకు వెళ్లే వారు ఉదయం 8 గంటలకే ఆయా పనులకు వెళ్లిపోతున్నారు. ఉదయం నుంచే తీవ్రమైన ఎండ ఉండడంతో జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణం సాగించే ప్రయాణికులు, వాహనదారులు వేడికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు దారి మధ్యలో చెట్ల నీడల్లో సేదతీరుతున్నారు. ఎండ వేడిని తట్టుకోలేక ప్రజలు శీతలపానీయాలను ఆశ్రయిస్తూ సేదతీరుతున్నారు. ఎండ దెబ్బకు పగటి పూట చేయాల్సిన పనులు కొందరు రాత్రులు చేసుకునే పరిస్థితి ఉంది. కొన్ని చోట్ల టెంట్లు వేసుకుని అత్యవసరమైన పనులు చేసుకుంటున్నారు.

పల్లెల్లో వేళాపాళా లేకుండా కోతలు

ఉదయం 9 గంటలు దాటిందంటే సూర్యుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. ఇంటి నుంచి బయటకు రావడానికే ప్రజలు జంకే పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇళ్లలో ఫ్యాన్ లేదా కూలర్ కింద కూర్చొని కాస్త సేద తీరుదామంటే కరెంట్ ఉండటం లేదు. విద్యుత్ శాఖ అధికారులు అప్రకటిత కోతలతో జనం అల్లాడిపోతున్నారు. వేళాపాళలేని కోతలతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో కోతలు పెడుతుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వేడి, ఉక్కపోతతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నా వాటి నివారణకు చర్యలు తీసుకోవడంలో క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఏదైనా సందర్భంలో కరెంటు సమాచారం తెలుసుకునేందుకు విద్యుత్ శాఖ కార్యాలయాలకు ఫోన్ చేస్తే..ఫోన్లు ఎత్తి సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారన్న వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. మెయింటనెన్స్ డే పేరుతో వారానికొకసారి ఐదారు గంటలు కోత విధిస్తూనే అనధికారికంగా కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.

రాజోలులో ఎండకు

మధ్యాహ్న సమయంలో రామచంద్రపురం ,ద్రాక్షారామం మెయిన్ రోడ్డు

వడదెబ్బ తగిలితే

వడదెబ్బ తగిలితే ప్రథమ చికిత్స ఇలా ఎవరైనా వడ దెబ్బకు గురైతే కళ్లు తిరిగి పడిపోవడం, శరీరం చెమటలు పట్టడం, స్పృహలో లేకపోవడం జరుగుతుంది. అలాంటి వ్యక్తిని ముందుగా నీడకు చేర్చి చల్లనీ నీళ్లతో శరీరాన్ని తుడవాలి. శరీరం సాధారణ స్థితికి వచ్చేవరకు తడి గుడ్డతో తుడుస్తూ చల్లగాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ గానీ ఒఆర్ఎస్ ద్రావణాన్ని గానీ తాగించాలి. నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యులకు చూపించాలి.

మరో మూడు రోజులు ఇదే పరిస్థితి

రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయి అనే నానుడి నిజం చేస్తూ ఎండలు మండిపోతున్నాయి. దీనితో జనం పచ్చని చెట్లు కిందకు పరుగెడుతున్నారు. ఉపాధి కూలీలు సైతం ఎండలో ఎక్కువగా ఉండలేక చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. రోడ్లపై జనసంచారం కానరావడం లేదు. పలువురు వడ దెబ్బకు గురవుతున్నారు. మరో మూడు రోజులు పరిస్థితి ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఇక మండుతున్న ఎండలు వల్ల మధ్యన సమయం లో ఎవరూ బయటకు రావద్దని, మంచినీరు, ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని తప్పని సరి పరిస్థితిలో బయటకు వస్తే టోపీలు ధరించాలని, మజ్జిగ, బార్లీ, కొబ్బరినీరు వంటివి అధికంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

గండేపల్లిలో నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తాలు తీసుకోవాలి

- ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారి నుంచి రక్షణ పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వివరించారు.
- సాధ్యమైనంత వరకు ఎండలో తిరగరాదు. తప్పనిసరి పరిస్థితుల్లో తలకు టోపి, లేదా టవల్ కట్టుకోవాలి, గొడుగు వేసుకుని వెళ్లడం మంచిది.మంచినీళ్లు అందుబాటులో ఉండాలి.
- నలుపు, ముదురు రంగు దుస్తులు కాకుండా తెలుపు లేదా లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి.
- రోడ్ల మీద విక్రయించే పానీయాలు, కూల్‌డ్రింక్స్ తాగరాదు.
- మాంసాహారం, మసాలాతో తయారుచేసిన ఆహారం తినరాదు. ఆకు కూరలు, కూరగాయలతో తయారు చేసిన ఆహారం మేలు.
- పరిశుభ్రమైన నీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఇంటిలో తయారుచేసే పండ్ల జ్యూసులు తీసుకోవాలి.
- మద్యం తాగడం, పొగ తాగడం వంటివి చేయరాదు. మద్యం తాగి ఎండలో ప్రయాణించడం మంచిదికాదు.
- వృద్ధులు, గర్భిణీలు, చినపిల్లలు ఇంటిలోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలోకి వెళ్లనీయరాదు.
- వేసవి సెలవులు కాబట్టి పిల్లలు బయటకు వెళ్లే ఆడుకోవడానికి ప్రయత్నం చేస్తారు. వారికి ఇంటిలోనే ఆటలు ఆడుకునేలా ఏర్పాట్లు చేసుకుంటే మంచిది.
- వృద్ధులు, చినపిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు

కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లో చేర్చుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 4500 మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధులలో చేర్చుకోవాలని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జూన్ 9న కలెక్టరేట్, మున్సిపల్ కేంద్రాల్లో జరిగే ధర్నాను జయప్రదం చేసేందుకు శుక్రవారం సిఐటియు కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాల సన్నాహక సమావేశం జరిగింది. ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషాబాబ్జి, ఐఎన్‌టియుసి ఏపి, తెలంగాణా రాష్ట్రాల కార్యనిర్వాహక కార్యదర్శి తాళ్లురి రాజు, ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు అంజిబాబు, ఎఐటియుసి నగర అధ్యక్షులు తోకల అన్నవరం పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ చర్యలు వేగవంతం అయ్యాయని, అందులో భాగంగానే పరిశ్రమలో పనిచేస్తున్న 4500 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, సొంత ఘనులు కేటాయించకుండా నష్టాలకు ఉద్యోగులే బాధ్యులని కూటమి ఎంఎల్‌ఎలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. తక్షణం తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధులలోకి తీసుకునేంతవరకు పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. జూన్ 9వ తేదీన కాకినాడ కలెక్టరేట్, అన్ని మున్సిపల్ కేంద్రాల్లో జరిగే ఆందోళనలు ప్రజాస్వామికవాదులు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోరే మేధావులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి మలకరమణ, వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, ఎఐసిసిటియు నాయకులు నరసరాజు, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు గుబ్బల ఆదినారాయణ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన డిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ రిక్రూట్మెంట్ టెస్ట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 131 మంది గైర్హాజరయినట్లు డిఇఒ పి. రమేష్ తెలిపారు. డిఎస్‌సి పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 6 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం జరగాల్సిన పరీక్షలకు 842 మంది హాజరు కావాల్సి ఉండగా 756 మంది హాజరయ్యారు. 86 మంది హాజరు కాలేదు. కాకినాడ సాఫ్ట్ టెక్నాలజీస్ సెంటర్లో 202 మంది హాజరు కావాల్సి ఉండగా 186 మంది, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 115 మందికి 102 మంది, ఆదిత్య యూనివర్సిటీలో 175 మందికి 164 మంది, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 170 మందికి 148 మంది, ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీలో 180 మందికి 156 మంది హాజరయ్యారు. మొత్తంగా ఉదయం పూట పరీక్షలకు 842 మందికి 756 మంది రాగా 86 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం కాకినాడ రాయుడు పాలెంలో సాఫ్ట్ టెక్నాలజీ సెంటర్లో 182 మందికి 137 మంది పరీక్షలు రాయిగా 45 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని మొదటి రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని డిఇఒ తెలిపారు.

బహుమతిని అందిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

సాంప్రదాయ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఆదరణ కోల్పోతున్న ప్రాచీన సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. శుక్రవారం మండలంలోని తిరుమాలి గ్రామంలో నేరేళ్ళమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్లబండ్ల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 50 జట్లు హాజరు హాజరయ్యాయి. నిర్వాహకులు సీనియర్, జూనియర్ విభాగాలుగా పోటీని నిర్వహించారు. సీనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో గుమ్ములేరు, ద్వితీయ స్థానంలో కొవ్వాడ, తృతీయ స్థానంలో కాపవరం జట్లు నిలిచాయి. వీరికి రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు చొప్పున నగదు బహుమతిని అందజేశారు. జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో చేయువాడ, ద్వితీయ స్థానంలో దుళ్ళ, తృతీయ స్థానంలో కొప్పవరం జట్లు నిలిచాయి. వీరికి రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు చొప్పున నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.విజయబాబు, మండల టిడిపి అధ్యక్షులు సూతి బూరయ్య, ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, కూటమి నాయకులు పరుపుల తమ్మయ్య బాబు, జ్యోతుల పెదబాబు, సూది వీర ప్రభాకర్, పాల్గొన్నారు.

మా గోడు ఎవరికీ పట్టదా..?

31వ రోజుకు కార్మికుల నిరసన

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

31 రోజులుగా రోడ్డుపైకి ఎక్కి ఆందోళన చేస్తున్న తమ సమస్యలను తమ గోడు పట్టించుకునే నాథుడే కరవైయ్యాడని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 31వ రోజుకు చేరింది. సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదురుగా జరుగుతున్న నిరసన శిబిరంలో నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 31 రోజులుగా సమ్మె చేస్తున్నా పాలకులు, అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణమే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కొండవీటి రామరాజు, ఉపాధ్యక్షులు కృష్ణ, నాయకులు మేడిపోయిన రమణ, రత్నరాజు, రమేష్, కురుకూరి మురళీకృష్ణ, చిక్కాల నాగార్జున, ఉండవల్లి రామరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ సమ్మె శిబిరాన్ని సందర్శించి కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 31 రోజులుగా తన సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. తమ సమస్యలను సానుభూతితో పరిశీలించి తమకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బాసిన భద్రరావు, వాకాడ భాస్కరరావు, ఆకుల రామకృష్ణ, అయ్యప్పస్వామి, కె.వెంకటరమణ, ఒ.సోనియా, మహపాతిన పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణ

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం స్థానిక శాఖా గ్రంథాలయంలో 40 రోజులు పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పాలంకి నాగరాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, డ్రాయింగు, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు తాటిగడప సుబ్బారావు, గ్రంథా లయ సిబ్బంది బుల్లయ్య, పాఠకులు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ముగిశాయి. ముగింపు కార్యక్రమం గ్రంథాలయ అధికారి బందిల రత్నామణి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ యార్లగడ్డ రాజేష్, కొమ్ము శివశంకర్, కొల్లు పెద్దిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ముగిశాయి. విద్యార్థులకు ఉమ్మడి జాను చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెమొంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉపాధ్యాయులు టి.నళిని, టి.జయకృష్ణ, రిసోర్స్‌పర్సన్ బి.శ్రీదేవి, డి.ఆనంద్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో విద్యార్థులకు ప్రశంశాపత్రాలు అందిస్తున్న నిర్వహకులు

బస్ కాంప్లెక్స్‌కు ఫ్యాన్ల వితరణ

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్‌లో విద్యుత్‌ను ఆదా చేసే బిఎల్‌డిసి ఫ్యాన్లను దాతలు శుక్రవారం తుని డిపో మేనేజర్ ఎం.కిరణ్‌కుమార్‌కు దాతలు అందించారు. ఈ ఫ్యాన్‌ను రిమోట్ కంట్రోల్ ద్వారా వినియోగించుకోవచ్చు. ఈ సందర్భంగా సంబంధిత దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ టిఎన్.రావు, పిఎన్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డిఎంకు ఫ్యాన్లు అందిస్తున్న దాతలు

బిఎస్‌ఎఫ్ జవాన్‌కు సన్మానం

ప్రజాశక్తి - జగ్గంపేట

ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న జగ్గంపేటకు చెందిన బిఎస్‌ఎఫ్ జవాన్ ఎండి.గౌస్‌మొహిద్దిన్ సాహెబ్‌ను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ముస్లిం కమిటీ సభ్యులు శుక్రవారం సున్ని జామియా మసీదు వద్ద సన్మానించారు. గౌస్ మొహిద్దిన్ ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్నందుకు మా ముస్లింలు అందరికీ గర్వంగా ఉందని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ ఛైర్మన్ ఎస్ఎ.గఫూర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ టి.రఘునాథరావు, మసీదు కమిటీ ప్రెసిడెంట్ ఆరిఫ్, బాషా, కాజా, కమిటీ సభ్యులు, చోట కాజా, రెహమాన్, కాజు, ఇబ్రహీం, షేక్ సలీం, వల్లిబాబు పాల్గొన్నారు.

జవాన్‌ను సత్కరిస్తున్న ముస్లింలు

నేడు మెగా యోగా డే

ప్రజాశక్తి - కాకినాడ

యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా స్థానిక మెయిన్ రోడ్‌లో శనివారం ఉదయం 6:30 గంటల నుంచి 9 గంటల వరకు మెగా యోగా డే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షాన్ మోహన్ సగిలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2వ టౌన్ పోలీస్ స్టేషన్ సెంటర్ నుంచి మెయిన్ రోడ్డులో గల టైటాన్ షోరూం వరకు ఒక కిలోమీటర్ మేర 5 వేల నుంచి 6 వేల మంది ఉపాధ్యాయులతో పెద్దఎత్తున యోగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మెగా యోగ డే నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. శనివారం సూర్య కళామందిర్‌లో 200 నుంచి 300 మందితో, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన్‌లో 300 నుండి 400 మందితో ఉదయం 6.30 గంటల నుంచి 9గంటల వరకు యోగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్టూ'నిజం'



యోగాతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం, కరప

యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. శుక్రవారం సామర్లకోట భీమేశ్వరాలయం ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామితో కలిసి జెసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు 30 నిమిషాలు యోగా చేయడం ద్వారా శారీరక ధృఢత్వం, మానసిక ప్రశాంతత పొందవచ్చని అన్నారు. యోగా వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ టూరిజం అధికారి పల్లాబత్తుల వసంత మాధవి, తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి, ఎంపిడిఒ కరక హిమామహేశ్వరి, సిఐ ఎ.కృష్ణ భగవాన్, ఆలయ ఇఒ బళ్ల నీలకంఠం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, ఎంఇఒ-1 వై.శివరామ కృష్ణయ్య, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బలుసు వాసు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు యోగ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టిపిఒ ఫణికుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కరపలో ఎంపిడిఒ ఎం.అనుపమ ఆధ్వర్యంలో స్థానిక నక్షత్ర లే ఔట్‌లో సామూహిక యోగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పంతం నానాజీ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి సలాది శ్రీనివాసరావు, కూటమి నాయకులు పెంకే శ్రీనివాస్‌బాబా, భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, ముద్రగడ రమేష్, బండారు మురళి పాల్గొన్నారు.

సామర్లకోటలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఉపాధి కూలీల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉపాధి కూలీలు వంద రోజులు పని పూర్తి చేసుకుని వారి జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ డైరెక్టర్ జి.శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం శ్రీరాంపురం గ్రామంలో సామాజిక తనిఖీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థాయిలో ఉపాధి వేతనదారులకు ఉపాధి హామీ చట్టం హక్కులు, సౌకర్యాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు 100 రోజులు పూర్తి చేసుకుని జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. సామాజిక, వనరుల పటం ద్వారా ఏ ఏ పనులు నిర్వహించారు, మిగిలిన ఏఏ పనులు ఉన్నాయి అనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డైరెక్టర్ జి.శ్రీకాంత్, స్టేట్ రిసోర్స్‌పర్సన్స్ గౌరీశంకర్, సత్యనారాయణ, కోనయ్య, ఎస్ఆర్‌పిలు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి జి.యమునా నాగదేవి పర్యావరణ దినోత్సవం- 2025 సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి సాధించిందని కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ డి.రవీంద్రనాథ్ రెడ్డిచేతుల మీదుగా విజేతకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందించారని తెలపారు. ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థినిని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ ఎన్.మూర్తి, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారి టి.తేజేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

ప్రథమ బహుమతితో యమునా నాగదేవి

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మకు శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు, అర్చనలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలు అనంతరం యాత్రికులకు పులిహార, ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాధులు రాయి నాని, రామచంద్రప్రసాద్, పూజారి ఐవి.ప్రసాద్‌శర్మ, సిబ్బంది ఎస్.రమణ, వరహాలు, శివ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కారు చెట్టును ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో ఒక యువకుడు, అతడి మూడేళ్ల మేనకోడలు మృతి చెందిన సంఘటన మండలంలోని పోతవరం వద్ద శుక్రవారం చోటు చేసుకంది. గ్రామానికి చెందిన నూతుకుర్తి మల్లేష్ (25) శుక్రవారం తల్లి రత్నకుమారి, సోదరి అంకిత, మేనకోడలు ఆద్య (3)తో కలిసి కారులో నిడదవోలు బయల్దేరారు. పోతవరం దాటిన తరువాత కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మామిడి చెట్టును బలంగా ఢీకొందవి. ఈ సంఘటనలో మల్లేష్, ఆద్య అక్కడికక్కడే మృతి చెందారు. తల్లి రత్నకుమారికి శరీరం నుండి కాలు వేరయ్యింది. చెల్లి అంకితకు పక్కట ముకలు విరిగి తలకు బలమైన గాయం అయ్యింది. వీరిని వెంటనే ఏలూరు ఆశ్రమం ఆసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి కూడా ప్రమాదకరంగా ఉన్నట్టు తెలుసుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిడిగట్లలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి - కోరుకొండ

సెల్ పోన్ విషయంలో వచ్చిన చిన్నపాటి వివాదంలో ఒక వ్యక్తిని హత్య చేసిన సంఘటన కోరుకొండ మండలం నిడిగట్లలో చోటు చేసుకుంది. కోరుకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటనగరానికి చెందిన కొవ్వాడి చిన్న అబ్బులు (30)కు తన స్నేహితుల మధ్య ఈ నెల 4వ తేదీన వచ్చిన చిన్నపాటి వివాదంలో చిన్న అబ్బులను మెడ కోసి, రాయితో కొట్టి చంపినట్లు తెలిపారు. సంఘటనా ప్రాంతాన్ని కోరుకొండ సిఐ సత్యకిషోర్ పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

తాపీ కార్మికుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన తాపీ కార్మికుడు పోతాబత్తుల వీరవెంకటసత్యనారాయణ(39) పులిమేరు గ్రామ రహదారిపై గురువారం అర్ధరాత్రి గాయాలతో మరణించాడని పోలీసులు తెలిపారు. తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్న సత్యనారాయణ గురువారం రాత్రి భోజనం చేసిన అనంతరం సైకిల్‌పై బయటికి వెళ్లి తిరిగి తన గ్రామం వస్తుండగా మార్గమధ్యలో పులిమేరు వద్ద రోడ్డుపై పడిపోయి ఉన్నాడని ముక్కు నుంచి రక్తస్రావం అవుతుండగా అతనిని చుట్టుపక్కల వారు పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని తెలిపారు. మృతునికి తల్లి, భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శుక్రవారం అతని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

కొబ్బరి చెట్ల తొలగింపు కేసులో నిందితునికి జరిమానా, జైలుశిక్ష

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి ఊబలంక కెనాల్ పక్కన ఉన్న కొబ్బరి చెట్లను అనుమతులు లేకుండా కొట్టించిన కేసులో పడాల రంగారెడ్డికి కోర్టు శిక్ష విధించింది. వివరాలు ప్రకారం 2017 డిసెంబర్ 3న చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి అదే గ్రామానికి చెందిన రంగారెడ్డి తన అనుచరులతో కలిసి, ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొబ్బరి చెట్లను నరికించాడని ఫిర్యాదు అందింది. ఈ విషయాన్ని ఆత్రేయపురం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కర్రా రాజమౌళి పరిశీలించడానికి వెళ్లగా, రంగారెడ్డి ఆయనపై దౌర్జన్యం చేసినట్టు సమాచారం. ఈ సంఘటనపై రాజమౌళి పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి రావులపాలెం ఎస్ఐ విద్యాసాగర్ రంగారెడ్డిపై కేసు నమోదు చేశారు. 2025 జూన్ 6న కొత్తపేట ఎజెఎఫ్‌సిఎం కోర్టులో వాదోపవాదనలు ముగిశాయి. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి రంగారెడ్డికి పది నెలల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి ఎన్.ఆనందరావు వాదనలు వినిపించగా, సాక్ష్యాల సేకరణలో సిఐ శేఖర్ బాబు కీలక పాత్ర పోషించారు.

పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీ స్వాధీనం

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు గామన్ ఇండియా వంతెన వద్ద పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టణ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి నుంచి హైదరాబాద్ తరలిస్తున్న లారీలో 38 పశువులు ఉన్నట్టు సిఐ పి.విశ్వం తెలిపారు. తెలంగాణలోని నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన తాండ్ర నరేష్, అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం లక్ష్మీపాలెంకు చెందిన పసరుల దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న ఆవులను గోశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు.

కార్యదర్శి శ్రీరామ్‌ను సత్కరిస్తున్న పంచాయతీ సిబ్బంది

కార్యదర్శి శ్రీరామ్‌కు సన్మానం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం సాకుర్రు గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా తన సేవలు అందించి ఉద్యోగోన్నతి పై గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శిగా అమలాపురం మండలం కామనగరువు-2కి నందంపూడి శ్రీరామ శరణ్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు శుక్రవారం పంచాయతీ కార్యాలయం లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్‌ను గ్రామంలోని పలువురు పెద్దలు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుత్తుల చిరంజీవి రావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్, మాజీ సర్పంచ్ ముల‌పర్తి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఆకుల సత్యనారాయణ, గ్రామ ఉపసర్పంచ్ బండారు చిన చంద్రరావు, పికె.కృష్ణారావు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు బండారు వెంకటేశ్వరరావు, కార్యదర్శి వి.రమ శైలజ, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా మలుపులు

-కానరాని హెచ్చరిక బోర్డులు
-పట్టించుకోని అధికారులు

బీచ్ రోడ్లో ప్రమాదకరంగా మారిన మలుపు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు మలుపులతో ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారు. ముఖ్యంగా ఉప్పాడ, పిఠాపురం రహదారిలో నాగులపల్లి రక్షిత మంచినీటి పథకం సమీపం వద్ద మలుపు వద్ద ఈ ఏడాది కాలంలో ఇద్దరు మృతి చెందగా, ఆరుగురు వరకూ గాయాలపాలయ్యారు. అలాగే ఉప్పాడ, కాకినాడ వెళ్లే సుబ్బంపేట సమీపం వద్ద ఉన్న మలుపు ప్రమాదభరితంగా ఉంది. నాగులపల్లి, కొమరగిరి, రమణక్కపేట, ఇలా పలు గ్రామాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం వందలాది వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఆయా రహదారుల్లోని మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల భారిన పడి మృతి చెందుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రాత్రి సమయాల్లో ఈ మలుపుల వద్ద ఇబ్బందికరంగా ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రమాదకర మలుపుల వద్ద సంబంధిత శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆదిత్యలో అడ్మిషన్ల సందడి

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణం 2025-2026 విద్యా సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియతో శుక్రవారం విద్యార్థులు వారి తల్లితండ్రులతో సందడిగా మారింది. ఈ సంవత్సరం ఇంజనీరింగ్ అడ్మిషన్లు సంతృప్తికరంగా ఉన్నాయని, గత సంవత్సరంతో పోల్చినా, జిల్లాలో మిగిలిన కళాశాలలతో చూసిన ఆదిత్యకు అత్యధిక శాతం అడ్మిషన్ పొందడం జరిగిందని యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండపేట ఆదిత్య జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్‌లో 992/1000 మార్కులతో స్టేట్ ప్రథమ స్థానం పొందిన అనపర్తికి చెందిన విద్యార్థిని నల్లమిల్లి సవిత యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో జాయిన్ అయింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సోదరి స్వాతిమిత్ర ఫైనల్ ఇయర్ సిఎస్ఇ చదువుతున్నదని, అక్క సూచనతో సిఎస్ఇలో చేరినట్లు తెలిపింది. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం నుంచే వివిధ కార్పొరేట్ కంపెనీలకు అనుగుణంగా విద్యార్థులకు టెక్నికల్ హబ్ ద్వారా వివిధ సర్టిఫికెట్ కోర్సులలో శిక్షణ ఇవ్వడం ఆదిత్యకు అదనపు బలం అని డాక్టర్ ఎంఎస్.రెడ్డి అన్నారు. ఈ అడ్మిషన్ల కార్యక్రమంలో డీన్ అడ్మిషన్స్ డాక్టర్ ఎ.రామకృష్ణ, అసోసియేట్ డీన్ అడ్మిషన్స్ డాక్టర్ ఆర్.గిరిప్రసాద్ పాల్గొన్నారు.

అడ్మిషన్ల కోసం వేచిచూస్తున్న తల్లిదండ్రులు

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని అండ్రంగి ప్రాథమిక ఉన్నత పాఠశాల, కాజులూరు జడ్‌పి పాఠశాల విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక అయ్యారని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎన్.గణేష్, కాజులూరు జడ్‌పి పాఠశాల హెచ్‌ఎం మార్ని విష్ణుమూర్తి తెలిపారు. శుక్రవారం వారు స్థానిక మానవ వనరుల కార్యాలయంలో మాట్లాడారు. గత డిసెంబర్లో నిర్వహించిన జాతీయ ప్రతిభ స్కాలర్‌షిప్ పరీక్షలో అండ్రంగి గ్రామానికి చెందిన కోన మణిశ్రీ, పంపన కుసుమాంజలి మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. అలాగే కాజులూరు జడ్‌పి పాఠశాలకు చెందిన సన్నపు లక్ష్మి, శిరం శ్రీసిరి వెన్నెల ఎంపికయ్యారని తెలిపారు. వీరికి నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.15 వేలు చొప్పున స్కాలర్‌షిప్ పొందనున్నారని తెలిపారు. ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులను ఎంపిడిఒ రాంబాబు, తహశీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, యుటిఎఫ్ కార్యదర్శి శిరం.దుర్గాప్రసాద్, జనసేన మండల ఇన్‌ఛార్జ్ అన్యం శ్రీరామచంద్రమూర్తి, సర్పంచ్ పెద్దిరెడ్డి సుజాత, హెచ్‌ఎం వెంకటలక్ష్మి, తణుకువాడ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, చింత నారాయణమూర్తి అభినందించారు.

విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనతో పథకం ద్వారా విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవాలని ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు సూచించారు. శుక్రవారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో పిఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యఘర్ ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చునని అన్నారు. 1 కెవి లోడ్ 120 యూనిట్లకు బిల్లు రూ.1000 వచ్చేదని, సోలార్‌తో రూ.338 మాత్రమే వస్తుందని, ఏడాదికి రూ.8 వేల వరకు పొదుపు చేసుకోవచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 1 కెవికి రూ.30 వేలు, 2 కెవికి రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు రాయితీ వస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాకినాడలో 10 వేల మంది సోలార్ రూఫ్ ట్యాప్ వేసుకోవడం జరిగిందన్నారు. అనంతరం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సదస్సులో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సుధాకర్, ఎలక్ట్రికల్ డిఇ ఉదయభాస్కర్, ఎడి వీరభద్రరావు, ఎఇలు, టిపిఆర్ఒ శైలజ, కూటమి నాయకులు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, తుమ్మల రమేష్, ఉమ్మి బాలాజీ, బచ్చు శేఖర్, చింతా పేర్రాజు, రహీమ్, చింతలపూడి రవి పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ కొండబాబు

నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల వసూలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని పలు ప్రయివేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వై.గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ బృందం పట్టణ పరిధిలో పలు ప్రయివేటు పాఠశాలలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పాఠశాలల్లో రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ ఫీజుల వ్యవహారంపై స్కూల్ యాజమాన్యాలను ప్రశ్నిస్తే అన్ని స్కూల్స్‌లో ఇదేవిధంగా ఫీజులు ఉన్నాయని, తాము ఎక్కువ తీసుకోవడం లేదని చెబుతున్నారని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారు ఫీజులు చెల్లించలేక ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ప్రయివేటు స్కూల్స్ తరగతులను బట్టి నిర్ణీత ఫీజు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు పాఠశాలలపై అధికారులు నిఘా పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు బచ్చు ఫౌండేషన్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి టి దుర్గామోహన్ ఎన్ఎం ఎంఎస్ పరీక్షలో అర్హత సాధించినట్లు హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి ఎంతో ప్రతిభను కనపరచి ఎంపికయ్యాడని వివరించారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థి దుర్గామోహన్‌ను ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన పీడీ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరంలోని 5, 6 అంగన్‌వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ పీడీ విజయకుమారి శుక్రవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని హాజరు పట్టీని పరిశీలించారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు విధిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లల తల్లులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ పరిశీలనలో సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ విజయకుమారి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి గొల్లపల్లి బుజ్జి

అధికారుల గైర్హాజర్‌పై ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రభుత్వ శాఖలకు చెందిన పలువురు అధికారులు మండల సమావేశానికి గైర్హాజరు కావడంపై ఎంపిపి గొల్లపల్లి బుజ్జి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రభుత్వ శాఖలకు చెందిన పలువురు అధికారులు హాజరు కాలేదు. అధికారులు సమావేశానికి రాకపోతే ఆ శాఖకు సంబంధించిన సమస్యలపై ఎలా చర్చిస్తామని ప్రశ్నించారు. సమావేశానికి రాని అధికారుల తీరును జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు చిక్కాల రాజ్యలక్ష్మి, సాదే లోవరాజు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ, వ్యవసాయ అధికారి బి.జ్యోతి, విద్యాశాఖ అధికారి బి.అబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

రామవరంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఐసిడిఎస్ పీడీ విజయకుమారి

ఆటలు శారీరక ఆరోగ్యానికి దోహదం

ప్రజాశక్తి - జగ్గంపేట

ఆటలు కేవలం సరదా కోసమే కాదని శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తాయని ఐసిడిఎస్ పీడీ విజయకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని రామవరం సచివాలయం వద్ద 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికలకు కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. సిడిపిఒ ఎం.పూర్ణిమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాయామం, యోగ, క్రీడలు ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. ప్రతీ రోజూ వ్యాయామం, యోగ చేయుటకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. బాల్య వివాహాలు వలన జరిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహ రహిత గ్రామంగా రామవరం గ్రామాన్ని తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, మహిళా పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

యానాం వార్తలు

కృష్ణారావును సత్కరిస్తున్న అభిమానులు

ప్రజాసేవకే ఈ జీవితం అంకితం
-పుట్టిన రోజు వేడుకలో మల్లాడి

ప్రజాశక్తి - యానాం

ప్రజాసేవకై ఈ జీవితం అంకితమని, నమ్ముకున్న ప్రజల కోసం ఎంత దూరమైనా వెళ్తానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం స్థానిక యర్రా గార్డెన్ లోని మల్లాడి స్వగృహం వద్ద మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో కృష్ణారావు 62వ పుట్టిన రోజు వేడుక ఘనంగా జరిగింది. తొలుత మల్లాడి కృష్ణారావు ఉదయలక్ష్మి దంపతులను, కుమారుడు వంశీ అనుపమ దంపతులను పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆయనను సభా వేదిక వద్దకు అభిమానులు కోలాటం నృత్యాలతో, పుష్పాలతో అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన వేడుకలో మల్లాడి మాట్లాడుతూ తన రాజకీయం ఒక్క యానాం సీటుతో ఉండదని, రాబోయే ఎన్నికలలో పుదుచ్చేరిలోని ఐదు ప్రాంతాల నుంచి ఎంఎల్ఎలను గెలిపించేలా ఉంటుందన్నారు. యానాం నియోజకవర్గంలో 36 సంవత్సరాలుగా నీతి నిజాయితీగా ప్రజలకు సేవలు అందిస్తున్నన్నారు. కోట్లాది రూపాయల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అనేక అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. తనను నమ్ముకున్న ప్రజల కోసం అన్ని విధాల అండగా నిలుస్తానని, రాబోయే రోజులలో యానాం నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో చేయనున్న అభివృద్ధి పనులు, కొత్త ప్రాజెక్టులను వివరించారు. వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకుని ఎంతో కొంత తమ వంతు సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో డబ్బుకు ఓటును అమ్ముకోకుండా, మనకి ఏ ప్రభుత్వం ద్వారా మంచి చేకూరుతుందో ఆలోచించి అడుగులు వేద్దామని అన్నారు. వచ్చే రోజుల్లో గిరియంపేటలో క్యాన్సర్ ఆసుపత్రి వస్తుందన్నారు. జిప్మర్ ఆసుపత్రి అత్యుత్తమ స్థానంలో నిలుస్తుందన్నారు. వచ్చే ఏడాది నుండి తాను పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉంటానని, పుట్టినరోజులు కోసం తనను ఇబ్బంది పెట్టవద్దని అభిమానులకు సూచించారు. అనంతరం అభిమానులు, వివిధ సంఘాల నాయకులు తీసుకువచ్చిన భారీ కేక్ లను కట్ చేశారు. గజ మాలలు, పుష్పగుచ్చాలు, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, పృథ్వీ, కుడిపూడి శివన్నారాయణ, ఇతర ప్రముఖులు మల్లాడికి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులు సభ వేదిక వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాలువ పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - కరప

మండల పరిధిలోని కాలువల్లో జరుగుతున్న పూడికతీత పనులను ఎంఎల్ఎ పంతం నానాజీ శుక్రవారం పరిశీలించారు. సంపర బోది నుంచి కూరాడ కాలువ డ్యాం వద్ద రెగ్యులేటర్‌కు ఉన్న చెక్క పాడైపోవడంతో రైతులు, కూటమి పార్టీల నాయకుల ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. ఎంఎల్ఎ ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు ఇనుప గేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన సంబంధిత గేటును పరిశీలించారు. అనంతరం కోరాడ శివారు చిన్నమామిడాడ కాలువలో తీస్తున్న పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. అనంతరం వాకాడ గ్రామంలో విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు వెలుగుబంట గంగాధర్, దూడల నారాయణుడు, భోగిరెడ్డి కొండబాబు, ముద్రగడ రమేష్, వి.సూరిబాబు, బండారు మురళి, సురేంద్ర పాల్గొన్నారు.

గేట్‌ను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ పంతం నానాజీ

విద్యార్థి దశలోనే సృజనాత్మకతను పెంపొందించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థి దశలోనే సృజనాత్మకతను పెంపొందించాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ అఖిల, దంత వైద్యనిపుణులు డాక్టర్ జమ్మి శిరీష అన్నారు. శుక్రవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరిగిన వేసవి శిక్షణా శిబిరంలో వారు ఆరోగ్య పరిరక్షణ, మానసిక వికాసంపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించే అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. దైనందిన జీవితంలో జరిగే అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. తెలియని అంశాలను తెలుసుకునే విధంగా బాలలను తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా నక్షత్ర దంత వైద్యశాల డాక్టర్ జమ్మి శిరీష ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్, అమృత, నమ్రత, సాయి, బంగారం, మణికంఠ, నేహా, రేణుక, అంజలి, అనూష, జశ్విత, లలిత, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నేరాల అదుపు కోసం డ్రోన్‌లతో నిఘా

ప్రజాశక్తి - జగ్గంపేట

నేరాలను అదుపు చేసేందుకు సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కాట్రావుల పల్లిలో వారపు సంతలో డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. గ్రామంలోని యువకులతో మాట్లాడి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి నేరాలు జరగకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని సిఐ తెలిపారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ ప్రసాద్

నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట నుంచి అచ్చంపేట వెళ్లే భారత్ మాల రోడ్డుకు బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా గడ్డర్లు లేపుతున్నందున సామర్లకోట నుంచి కలెక్టరేట్ వైపునకు వచ్చే కెనాల్ రోడ్డు రహదారికి ఈనెల 7 నుంచి 10 వరకు ట్రాఫిక్ నిలుపుదల చేస్తున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట జంక్షన్‌లో రోడ్డుపై గడ్డర్‌లు లేపుతున్నందున జూన్ 11 నుంచి 13 తేదీ వరకు మూడు రోజుల పాటు ట్రాఫిక్ మళ్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి పోలీసు అందించే మార్గదర్శకాలను పాటించి తమ వాహనాలను మళ్లించాలని ఆయన సూచించారు.

గడ్డర్లు అమర్చే ముత్యాలమ్మ రాయి ప్రాంతం

శారీరక వ్యాయామం తప్పనిసరి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటలు బాలికలకు తప్పనిసరిగా ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగ కౌన్సిలర్ బి.దుర్గారాణి అన్నారు. శుక్రవారం సిడిపిఒ సిహెచ్‌ఎస్‌కె.దుర్గాదేవి ఆధ్వర్యంలో ఇసుకపల్లి, నాగులపల్లి గ్రామాల్లో కిశోర వికాసంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకౌమార బాలికల శారీరక వ్యాయామం, క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. క్రీడలు ఆత్మవిశ్వాసం, నాయకత్వం స్నేహాలను పెంపొందించడంలో సహాయపడతాయని అన్నారు. బాలల హక్కులు, చట్టాలు కౌమర బాలబాలికలసమస్యలు, పోషణ అవసరాలు, పిల్లల సంరక్షణ, పిల్లల సంరక్షణలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహ నిర్మూలన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇసుకపల్లి యానిమేటర్ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారాణి

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మై -కేర్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం చేబ్రోలు మెయిన్ రోడ్ సాయిబాబా గుడి ప్రక్కన ఉన్న ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ వైద్యులు శివశంకర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత శిబిరం ఉంటుందన్నారు. ఈ శిబిరంలో బిపి, షుగర్, బరువు, పల్స్ ఇతర అనారోగ్య సమస్యలు, ఎముకలు, కీళ్ల నొప్పులకు స్త్రీ ప్రసూతి సమస్యలపై డాక్టర్లు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ శిబిరానికి వచ్చే ప్రజలు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తీసుకుని రావాలని కోరారు.

IN THE COURT OF THE V ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT KAKINADA
EP.No.116/2023 in O.S.No.97/2020

Between:
Gubbala Satyanarayana ...DHR/Plaintiff
and
Tekumudi Suryabhaskara Rao ...JDR/Defendant

To.
Tekumudi Surya Bhaskara Rao, S/o.Kamaraju, R/o. D.No.4-392/18, Zilla parishad High School, New Gaigolupadu Kakinada.

పై నెంబరు అమలు గ్రందములోJDR అయిన మీకు శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు సేల్ నోటీసులు పంపినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు హజరు నిమిత్తం **ది.23-06-2025** సం॥తేదికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ **10.30** ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

SK.AMEER JANI
Advocate,
Jagannadhapuram,Kakinada
Cell 9642406830